క్లుప్తంగా

రామాలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ దంపతులు

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో కోదండ రామాలయ పునః నిర్మాణానికి సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. వెంటనే నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. గ్రామంలోని ఈ ఆలయానికి సుమారు 100 సంవత్సరాల చరిత్ర ఉందని సర్పంచ్ సత్యనారాయణ తెలిపారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించి, సహకరించాలని శ్రీకోదండ రామాలయం ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ కుమార్తె శ్రీనాగలలిత హాసిని పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు వాటిని అందజేశారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు యనమదల సుబ్రహ్మణ్యం, కంఠమణి రామకిషోర్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మహ్మద్ హుస్సేన్, కోశాధికారి నాళం వీర వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేస్తున్న పెరవలి గ్రామస్తులు

పెరవలి: కోల్‌కతాలో మెడికోపై అత్యాచారం చేసి, చంపేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పెరవలి గ్రామస్తులు గ్రామంలో బుధవారం రాత్రి రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐకేపీ అధ్యక్షురాలు ఆగర్తి స్వరూపారాణి, ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్డ్ ఇండియా సేవలు విస్తృతం కావాలి



కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు మరింత విస్తృతం కావాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. మండలంలోని యర్నగూడెంలో పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన డిజిటల్ కుట్టుశిక్షణ కేంద్రాన్ని బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. కుట్టు శిక్షణ పొందిన 60 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ ఈడీ కారుమంచి గణేష్, దేవరాజు అచ్యుతరావు, ఎస్. వెంకట్రావు, ఎన్. వెంకట్, షరీఫ్ పాల్గొన్నారు.

వర్షాలతో నిమ్మ రైతుల దిగాలు

- వర్షాలకు రాలిపోయిన పూత
- దసరాకు నిమ్మ కాయల కొరత
- అయోమయంలో కౌలు రైతులు
- ఆశాజనకంగా నిమ్మ మార్కెట్



దేవరపల్లి మండలం యాదవోలు మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన నిమ్మకాయలు

దేవరపల్లి: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు నిమ్మ తోటలు దెబ్బతిన్నాయి. తోటలు పూత, పిందె దశలో ఉండగా దాదాపు 15 రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దాంతో తోటలు ఇవక వేసి పూతలు నేలరాలినట్టు రైతులు తెలిపారు.ఈ ప్రభావం దసరా సీజన్‌పై పడుతుందని వారు వాపోతున్నారు. ఏడాదికి మూడు సార్లు నిమ్మ దిగుబడులు వస్తాయి. జూలైలో వచ్చిన పూత దసరాకు కాయలుగా తయారై అమ్మకానికి సిద్ధమవుతాయి. దసరా సీజన్‌లో నిమ్మకాయల వినియోగం ఎక్కువ. దాంతో మార్కెట్లో కాయలకు డిమాండ్ ఎక్కువ. ఏడాదిలో వేసవి, దసరా (అక్టోబరు) వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తోంది. రెండు సీజన్లలో వచ్చిన ఆదాయం రైతుకు లాభసాటిగా ఉంటుంది. దసరా దిగుబడులపై ఆశలు లేవని రైతులు వాపోతున్నారు.

కుదేలైన కౌలు రైతులు

భారీ వర్షాలకు నిమ్మతోటలు దెబ్బతినడంతో కౌలు రైతులు కుదేలయ్యారు. నిమ్మ రైతుల్లో ఎక్కువ మంది కౌలుదారులే. ఎకరం నిమ్మతోటను రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్ష రేటుకు కౌలుకు తీసుకుని రైతులు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా నిమ్మపంటకు గిట్టుబాటు ధర లభించడంతో రైతులు ఆర్థికంగా కోలుకున్నారు. ఈ క్రమంలో నిమ్మతోటల కౌలు రేటు పెరిగింది. వేసవిలో కిలో నిమ్మకాయల రేటు రూ.70 నుంచి రూ.75 పలకడడంతో ఈ ఏడాది ఎక్కువ రేటుకు కౌలుకు తీసుకుని రైతులు పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత, పిందె దశ బాగుండడంతో దసరాకు నాలుగు డబ్బులు మిగులుతాయని ఆశతో ఉన్న రైతులకు వర్షాలు నిరాశ మిగిల్చాయి. ఎకరాకు రూ.30 నుంచి రూ. 35 వేల వరకూ నష్టం వస్తుందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా దసరా సీజన్‌లో మండలంలోని యాదవోలు మార్కెట్‌కు రోజుకు 40 నుంచి 50 టన్నుల నిమ్మకాయలు వస్తాయి. ఈ ఏడాది పూత రాలిపోవడం వల్ల 10 టన్నుల దిగుబడి రావడం కూడా కష్టమని రైతులు లెక్క వేస్తున్నారు.

ధర బాగున్నా.. దిగుబడులు లేవు

నిమ్మకాయల ధర బాగున్నప్పటికీ దిగుబడులు లేవని రైతులు తెలిపారు. ఆషాఢం, శ్రావణ మాసాల్లో మార్కెట్లో నిమ్మకాయలకు రేటు తక్కువగా ఉంటుంది. దసరా నుంచి మార్కెట్ ఊపందుకుంటుంది. అయితే ఈ ఏడాది ఆషాఢం, శ్రావణ మాసాల్లో కూడా గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు తెలిపారు. ప్రస్తుతం కిలో నిమ్మకాయలు రూ. 50 పలుకుతున్నట్టు రైతులు తెలిపారు. వర్షాకాలంలో నిమ్మకాయల వినియోగం తక్కువగా ఉండడం వల్ల కొనుగోళ్లు తక్కువగా ఉంటాయి. దీంతో కాయలు కొనేనాథుడే ఉండని పరిస్థితి. అందుకు భిన్నంగా ఈ ఏడాది మార్కెట్లో ధర ఆశాజనకంగా ఉందని రైతులు తెలిపారు. దిగుబడులు తక్కువగా ఉండడం వల్ల రోజుకు 200 బస్తాల (10 టన్నులు) కాయలు మార్కెట్‌కు వస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు.

యాదవోలు నుంచి కోల్‌కతాకు ఎగుమతి

యాదవోలు మార్కెట్ నుంచి నిమ్మకాయలు ప్రధాన నగరాలకు ఎగుమతి జరుగుతుంది. ఇక్కడ రైతులే వ్యాపారులుగా మారి మార్కెట్లో కాయలు కొనుగోలు చేసి కోల్‌కతా, ఒడిశా, విశాఖపట్నం, రాజమహేంద్రవరం వంటి నగరాలకు ఎగుమతి చేస్తారు. దళారీ వ్యవస్థకు చెక్ పెట్టి రైతులు కమిటీగా ఏర్పడి కాయలు కొనుగోలు చేస్తారు. రైతుల నుంచి ఎటువంటి కమీషన్ తీసుకోకుండా గిట్టుబాటు ధరకు కాయలు కొనుగోలు చేస్తారు. సమీప పది మండలాల నుంచి రైతులు పంటను యాదవోలు మార్కెట్‌కు తీసుకు వచ్చి అమ్ముకుంటారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు మార్కెట్ పని చేస్తుంది. గ్రామంలో దాదాపు 200 మంది రైతులు నిమ్మపంటను సాగు చేస్తున్నట్టు సమాచారం. సుమారు 1000 ఎకరాల్లో గ్రామంలో నిమ్మతోటలు ఉన్నాయి.

భూసారం తగ్గడంతో..



భూసారం తగ్గడం వల్ల వర్షాలకు తోటలు తట్టుకోలేక ఇవక వేసి చెట్టు కొమ్మలు ఎండి పోతున్నాయి. కలుపు మందులు ఎక్కువగా కొట్టడం వల్ల ఆ ప్రభావం చెట్టుపై పడుతోంది. మందుల పిచికారీ వల్ల భూమిలోని సారం దెబ్బతింటుంది. అధిక వర్షాలకు భూమిలో తేమ ఎక్కువగా ఉండి రోజుల తరబడి ఆరకపోవడం వల్ల ఊట వేసి పూతలు రాలిపోతున్నాయి. పూతలు రాలిపోయి తోటలు వెలవెలబోతున్నాయి. దసరా దిగుబడులపై ఆశలేదు.

– సింగులూరి రామ్మోహనరావు, రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం

కోలుకోలేని దెబ్బ



భారీ వర్షాల వల్ల నిమ్మరైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆశాజనకంగా ఉన్న పూతలు పూర్తిగా రాలిపోయాయి. రెండు వారాలు విడవకుండా వర్షాలు కురవడంతో పొలాలు ఇవక వేసి పూత, పిందెలు రాలిపోయాయి. దీని వల్ల దసరా పంట నష్టపోయాం. దసరాకు ఎకరాకు సుమారు 30 బస్తాల దిగుబడి వస్తాయి. అధిక ధరకు తోటలను కౌలుకు తీసుకుని, పెట్టుబడులు పెట్టిన కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

– అనిశెట్టి సూర్యచంద్రరావు, రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం

చాగల్లు ఎస్సైగా నరేంద్ర బాధ్యతల స్వీకరణ



చాగల్లు: స్థానిక ఎస్సైగా కె.నరేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడలోని ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన ఆయన బదిలీపై చాగల్లు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పి.నాగరాజు తాడేపల్లిగూడెం బదిలీ అయ్యారు. నరేంద్ర గతంలో తాళ్లపూడి, సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా పనిచేశారు. చాగల్లు పోలీస్‌స్టేషన్‌కు బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నరేంద్రకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించే గెస్ట్ ఫ్యాకల్టీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతానికి పైబడిన మార్కులతో పీజీ పాసై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు. అనుభవం కలవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు.

చాగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

చాగల్లు: స్థానిక ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేపీ పావని తెలిపారు. ఫిజిక్స్‌లో 55 శాతానికి పైబడిన మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా సంబంధిత విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆమె తెలిపారు.

టెంపుల్, అటవీ టూరిజానికి ప్రణాళిక

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ వెల్లడి
- ఉమ్మడి 'పశ్చిమ' జనసేన ఎమ్మెల్యేలకు దేవరపల్లిలో సన్మానం



జనసేన ఎమ్మెల్యేల ఆత్మీయ సన్మాన సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, వేదికపై పలువురు ఎమ్మెల్యేలు

దేవరపల్లి: ద్వారకాతిరుమల కేంద్రంగా టెంపుల్ టూరిజం, ఏజెన్సీ ప్రాంతాన్ని అనుసంధానిస్తూ అటవీ టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ద్వారకాతిరుమల, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, పోలవరం ప్రాంతాల్లో పురాతన ఆలయాలు ఉన్నందున ద్వారకాతిరుమల కేంద్రంగా టెంపుల్ టూరిజం, బుట్టాయిగూడెం, పోలవరం ప్రాంతాన్ని ఆటవీ టూరిజంగా అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఆత్మీయ సన్మానం జరిగింది. దేవరపల్లిలోని కాకర్ల కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ సభకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అధ్యక్షత వహించారు. మంత్రి దుర్గేష్‌ను, జనసేన ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు (పోలవరం), ధర్మరాజు (ఉంగుటూరు), బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), గోపాలపురం టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు (గోపాలపురం)లను డి.సువర్ణరాజు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, చిర్రి బాలరాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

23న నిడదవోలులో ఎమ్మార్పీఎస్ సమావేశం

ఉండ్రాజవరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అనుబంధ సంఘాల జిల్లా సమావేశం నిడదవోలులో ఈనెల 23న జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు బుధవారం పాలంగిలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు హాజరవుతారన్నారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రిలో అదనంగా 20 బెడ్స్

- అత్యవసరంగా ఏర్పాటు
- నిడదవోలులో ముమ్మరంగా ఫీవర్ సర్వే

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు: స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల అవసరాల మేరకు అదనంగా 20 పడకలు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఎస్‌పీ పద్మశ్రీరాణి చెప్పారు. 'విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు' అనే శీర్షికన ఈనెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డాక్టర్ పద్మశ్రీరాణి స్పందించారు. ఆసుపత్రిలోని బెడ్స్ సరిపోక, వరండాలో బెడ్స్ ఏర్పాటు చేసి జ్వర పీడితులకు వైద్య సేవలు అందించడంపై ఆమె వెంటనే చర్యలు తీసుకున్నారు. ఇన్ పేషెంట్ల కోసం బుధవారం అదనంగా మరో 20 పడకలు ఏర్పాటు చేశారు. ఆ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే కొవ్వూరు మలేరియా సబ్ యూనిట్ బృందాన్ని పంపించి నిడదవోలు పట్టణంలో ఫీవర్ సర్వే చేయించారు. స్థానిక చర్చిపేట, సంత మార్కెట్ ఏరియాలో స్థానిక వైద్య సిబ్బందితో కలసి ఈ ఫీవర్ సర్వే జరిపారు. పరిసరాల శుభ్రత, వైరల్ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సర్వే సిబ్బంది ప్రజలకు వివరించారు. దోమల నివారణకు పట్టణంలోని పలు డ్రైనేజీల్లో పిచికారీ చేయించారు. వీధుల్లో ఫాగింగ్ చేయించారు. అలాగే జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఎస్‌పీ పద్మశ్రీరాణి ఫోన్‌లో నిడదవోలు ఆసుపత్రి వైద్యులతో సమీక్షించారు. డీఆర్‌పీ కింద పీజీ చేసిన ఇద్దరు వైద్యులను నియమించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కిట్లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చారు. 24 గంటలూ విద్యుత్ సరఫరాకు వీలుగా జనరేటర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎఫ్ఏ ఫయాజ్ అన్సారీని ఆదేశించారు.



నిడదవోలు,చర్చిపేటలో ఫీవర్ సర్వే చేస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది



డ్రైన్‌లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

దారిదోపిడీ ముఠా అరెస్ట్

దేవరపల్లి: జాతీయ రహదారిపై దారి కాసి వాహనదారులను బెదిరించి సొమ్ములు వసూలు చేస్తున్న ముఠా సభ్యులను స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై వి. సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరు రాఘవేంద్ర కాలనీకి చెందిన సిర్రా జాస్పర్ ప్రిన్స్, అక్కడకు సమీపంలోని సత్యనారాయణ నగర్‌కు చెందిన గెల్లా సజని, హుకుంపేటలోని రామకృష్ణనగర్‌కు చెందిన గెల్లా విసేష్ చార్లెస్, వేమగిరి శ్రావణ్య, రాజమహేంద్రవరానికి చెందిన సాయి, సంతోష్, చిరు కలసి ముఠాగా ఏర్పడ్డారు. వారిలో ఐదుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ ముఠా ఇన్నోవా కారుకు పోలీసు సైరన్ ఏర్పాటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం గేదెలను తరలిస్తున్న ఓ వాహనాన్ని జాతీయ రహదారిపై స్థానిక డైమండ్ జంక్షన్ వద్ద ఆపి తాము పోలీసులం అని చెప్పి, వారి వద్ద నుంచి ఫోన్ పే ద్వారా రూ.15 వేలు కాజేశారు. కొద్దిసేపటికే ఈ విషయం పోలీసు ఉన్నతాధికారులకు చేరింది. వారి ఆదేశాల మేరకు దేవరపల్లి సీఐ బాల సురేష్ తన సిబ్బందితో కలసి డైమండ్ జంక్షన్‌కు చేరుకున్నారు. అదే సమయానికి ఆ ముఠా బొలెరో వాహనంలో ఆవులను తరలిస్తున్న వారిని ఆపి రూ.25 వేలు కాజేసే ప్రయత్నం చేయసాగింది. ఆవులను తరలిస్తున్న వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు తీసుకుని, మిగతా 23 వేలూ ఫోన్ చేయమని ఈ ముఠా సభ్యులు డిమాండ్ చేయ సాగారు. ఇదే సమయంలో పోలీసులు దాడి చేసి ఆ ముఠాలోని ఏడుగురిని అరెస్టు చేసినట్టు దేవరపల్లి ఎస్సై సుబ్రహ్మణం తెలిపారు. పశువుల రవాణా చేస్తున్న వివిధ వాహన డ్రైవర్ల నుంచి, పశువుల యజమానుల వద్ద నుంచి ఈ ముఠా దారి కాచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు విచారణలో తేలిందని ఎస్సై చెప్పారు. నిందితులు ఏడుగురినీ కోర్టుకు హాజరు పరిచినట్టు ఆయన తెలిపారు.

వసతిగృహాల్లో అధికారుల తనిఖీలు

కొవ్వూరు: కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లోని వివిధ వసతి గృహాలను ఇన్‌చార్జ్ జిల్లా స్త్రీ,శిశు సంక్షేమాధికారి కె.నాగలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని మదర్ థెరిసా హోం, ఆరికిరేవులలోని క్రిస్టియన్ చారిటబుల్ సొసైటీ వసతిగృహం, తాళ్లపూడి మండలంలోని మలకపల్లిలోని అవిలా చిల్డ్రన్స్ హోంను, గజ్జరంలోని హోప్ ఫౌండేషన్ చిల్డ్రన్స్ హోంలను తాము తనిఖీ చేసినట్టు ఆమె వివరించారు. ప్రైవేట్ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య, హాజరు నమోదు వంటి వివరాలను పరిశీలించామని చెప్పారు. వంట చేసే ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిర్వాహకులకు సూచించామన్నారు. ప్రతి వసతి గృహాలోనూ విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించామని ఆమె చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మి ,ఇతర సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.



కొవ్వూరు మదర్ థెరిసా హోంలో విద్యార్థులతో మాట్లాడుతున్న నాగలక్ష్మి, ఇతర అధికారులు

రావిమెట్లలో 260 మందికి కంటి పరీక్షలు

నిడదవోలు రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో రావిమెట్ల పంచాయతీ కార్యాలయం వద్ద క్లబ్ సలహాదారు ఇంజే శేఖర్ ఆర్థిక సహాయంతో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు రాచర్ల చైతన్యబాబు ప్రారంభించారు. వేమగిరి యోగానంద నేత్రాలయం సిబ్బంది 260 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో 30 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ధారించారు. 127 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాల్దారి సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఉప్పులూరి తేజశ్రీ , క్లబ్ కార్యదర్శి ఆకుల రాజీవ్, సభ్యులు గాలి రాఘవయ్య, ఇంజే ఝాన్సీ, కొయ్యే నాగులు, మీరావలీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు

కొవ్వూరు: పట్టణంలోని రామానంద గౌడీయ మఠంలో రాధాకృష్ణుల డోలోత్సవం, శ్రీకృష్ణ జయంతి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనెల 16న ప్రారంభమైన ఈ ఉత్సవాలు బుధవారం ఆరో రోజుకు చేరాయి. రోజూ శ్రీకృష్ణ నామ సంకీర్తనలు, భాగవత ఉపన్యాసాలు, భజనలు నిర్వహిస్తున్నారు. బుధవారం మల్లాది విరూపాక్ష శాస్త్రి ఆధ్వర్యంలో భజన, శ్రీమద్భక్తిరక్షక నిమి మహారాజు ఉపన్యాసం అందించారు. 27న శ్రీకృష్ణ జయంతి మహోత్సవం, 28న నందమహారాజుల ఆనందోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

25న చిన్నారులతో బాలగోకులం

కృష్ణాష్టమి సందర్భంగా ఈ నెల 25 ఉదయం 9 గంటలకు స్థానిక గౌతమీనగర్‌లోని పురుషోత్తమ మందిరంలో బాలగోకులం కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంస్కార భారతి సంస్థ కారదర్శి టీఎస్‌వీ రమణమూర్తి తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషధారణలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. చిన్నారులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

భారత్ బంద్ పాక్షికం

- ప్రభుత్వాఫీసులు, విద్యాసంస్థల మూసివేత
- యథావిధిగా నడిచిన బస్సులు, ఇతర వాహనాలు
- దుకాణాలు మూయించి వేసిన ఆందోళనకారులు



కొవ్వూరు మెయిన్ రోడ్డులో బంద్ నిర్వాహకుల నిరసన ప్రదర్శన



గౌరీపట్నంలో బ్యాంకు వద్ద మాలమహానాడు, అంబేడ్కర్ యువజన సంఘాల సభ్యుల నిరసన

కొవ్వూరు: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలలు, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన భారత్‌బంద్ ప్రశాంతంగా సాగింది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు, దుకాణాలను మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తన సిబ్బందితో కలసి ఆర్టీసీ డిపోలో ఉండి బంద్‌ను పర్యవేక్షించారు. ఆందోళనకారులు దుకాణాలను మూయించి వేయగా, వారు వెళ్లిన కొద్ది సేపటికే యజమానులు మళ్లీ దుకాణాలు తెరిచారు. బంద్ పాక్షికంగా కొనసాగిందని చెప్పవచ్చు. మాలమహాసభ జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బొంతా శ్యాం రవిప్రకాష్ సారథ్యంలో మెయిన్‌రోడ్డులో మాలలు నిరసన ర్యాలీ చేశారు.

దేవరపల్లి: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాల మహానాడు, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో మండలంలో బంద్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలను మూయించి వేశారు. బంద్ దేవరపల్లిలో పాక్షికంగాను, యర్నగూడెం, గౌరీపట్నం, పల్లంట్ల గ్రామాల్లో సంపూర్ణంగానూ జరిగింది. మాల మహానాడు, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై కొద్దిసేపు రాస్తారోకో చేశారు.

తాళ్లపూడి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల జేఏసీ ఆధ్వర్యంలో మండలంలో బంద్ నిర్వహించారు. ప్రక్కిలంక నుంచి బజార్ సెంటర్ మీదుగా తాళ్లపూడి వరకూ మాలలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. బంద్ ఆందోళనకారులు తాళ్లపూడిలోని దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు మూయించి వేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి.

నల్లజర్ల: నల్లజర్లలో బుధవారం పాక్షికంగా బంద్ జరిగింది. పాఠశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. దళిత నాయకుడు జి.వెంకట సుబ్బారావు తదితరులు సారథ్యం వహించారు.

ఉండ్రాజవరం: అంబేడ్కర్ కల్చర్ యూనియన్ సభ్యులు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పెరవలి: భారత్ బంద్ సందర్భంగా మండలంలోని పాఠశాలలు మూత పడ్డాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగక పోవడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.